కథా కౌముది

# అరణ్యవాసంలో సీతారాములు

- బత్తిని తిమ్మగురుడు

"పద్మా! నీకో విషయం తెలుసా?" పక్కనున్న కొలీగ్ అడిగింది. నేను ఆఫీసులోకి అడుగుపెట్టి కుర్చీలో కూర్చుంటుండగానే...

"బాగుందే నీ వ్యవహారం! చెపితే కదా తెలిసేది" అన్నాను చిరునవ్వుతో.

"మన అకౌంటెంట్ రమ తన పక్కింటాయనతో లేచిపోయిందంట"

ఆ మాట వినగానే నా ముఖం మీది చిరునవ్వు ఎటో ఎగిరిపోయింది. రమ ఎందుకింత పనిచేసింది? నాతో చెప్పినట్లే చేసిందే! నేను దాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. నాతో కామెడీగా చెప్పిందనుకున్నాను గాని నిస్తేజంగా అలా చేస్తుందనుకోలేదు.

రమ ఒకసారి నాతో చెప్పింది.

ఆమె భర్త బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నాడట. అతను ఎప్పుడోసారి వచ్చిపోయేవాడట. అతను ఎంత ప్రేమగా చూసుకున్నా.. తనకు ఏదో కోల్పోయినట్లుండేదంట. అది రమ చేసిన తప్పా?

ఇందులో రమది తప్పు ఉండకపోవచ్చునేమో! భార్యాభర్తలు మధ్య దూరం మరీ మంచిది కాదు. వాళ్ళాయన తనకు ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చి, ఎంతో స్వేచ్ఛను ఇచ్చాడు. కాని వారి మధ్య దూరంను పెంచుకుని తప్పుచేశాడేమో!

ఫోను రింగయింది నన్ను ఆలోచనలనుండి బయటకు లాగడానికి విశ్వప్రయత్నం చేస్తూ. ఆ ఫోన్ రిసీవ్ చేసుకున్న తర్వాత నాకు ఎగిరి గంతులెయ్యాలనిపించింది. ఎందుకంటే ఎప్పుడో ఏడేళ్ళ క్రితం నాతో కలిసి చదువుకున్న సుమ ఫోన్ చేసింది.

"ఏయ్ పద్దు! నేను నువ్వు పనిచేసే బ్యాంకులోనే క్యాషియరుగా జాయినవుతున్నాను తెలుసా! ఈమధ్యనే నన్ను నువ్వుండే బ్రాంచ్‌లో జాయినవమని ఆర్డరొచ్చింది."

సుమ ఆ మాట అనేసరికి ఎంతో సంతోషపడ్డాను. ఎందుకంటే నా పాత స్నేహం మరల చిగురు వేసి మొలకెత్తుతుందంటే అంతకన్న సంతోషం ఏముంటుంది!? మొన్న మేనేజరుగారు ఎవరో కొత్త క్యాషియరు వస్తున్నారంటే పట్టించుకోలేదు. కాని ఆ క్యాషియరుగా తనే వస్తుంటే నా మనసు ఉబ్బితబ్బిబ్బయిపోయింది. ఫోను పెట్టేసింది సుమ.

"హాయ్ పద్దూ! బాగున్నావా?" మొబైల్ అలా టేబుల్ మీద పెడుతూండగానే, ఒక యువతి వచ్చింది అక్కడకు.

"నేనే పద్దు! నీ ఫ్రెండ్ సుమను" నా ప్రక్కన కూర్చోబోయింది.

"హాయ్ కాజోల్! ఎంత ఆటపట్టించావే! బయటనుండి ఫోను చేసావు కదు!? త్వరలో వస్తావనుకున్నానుగాని ఇంత త్వరగా వచ్చి సర్‌ప్రైజ్ చేస్తావనుకోలేదు" అని, వెంటనే

"మిస్ కాజోల్! ముందు మేనేజరును కలిసిరా పో. తర్వాత మాట్లాడుకుందాం." నేను అనగానే నా నిక్‌నేమ్ ఇంకా గుర్తుపెట్టుకున్నావా అన్నట్లు నావైపోసారి చూసి, మేనేజరు గారి క్యాబిన్ వైపు కదిలింది తను. నాకు నా కాలేజ్ లైఫ్ గుర్తుకు వచ్చింది.

"మనం చదువుకున్న రోజులు గుర్తుకు వచ్చాయా పద్మూ?" నా ముందుకు చైరు లాగి కూర్చోబోయింది సుమ కొద్దిసేపయిన తర్వాత వచ్చి.

"సుమా! ఇపుడిలా మనం మాటలు పెట్టుకుని కూర్చుంటే మేనేజరుగారితో మాటలను పడాల్సి వస్తుంది. ఆఫీసు టైము అయిపోగానే మా ఇంటికి వెళదాము. సరేనా?"

తను సరేనని తన పనిలో తానులీనమయిపోయింది. నేను కంప్యూటర్‌లో డేటా టైపు చేస్తూ పనిలో లీనమయిపోయాను. ఈ రోజు శనివారం కాబట్టి టైము త్వరగా గడిచిపోయింది. మేమిద్దరం మా ఇంటికి బయలుదేరాం.

"పద్మూ! నాకు అద్దెకు ఇల్లు కావాలి. మీకు దగ్గరలో ఏమైనా దొరుకుతాయా?" మా ఇంటిని చూస్తూ అడిగింది సుమ.

"నీవు అదృష్టవంతురాలివే! లేకపోతే నాకు వారం రోజులకు గాని అద్దెకు ఇల్లు దొరకలేదిక్కడ. మా ఇంటిపైన ఇల్లు ఖాళీ. ఆ ఇంటి ఓనరు ఎవరైనా అద్దెకు వస్తే దాన్ని ఇవ్వమని లాక్ ఇచ్చివెళ్ళాడు."

"అయితే అదృష్టవంతురాలినేంటీ" కప్పు చేతిలోకి తీసుకుంది.

అంతలో స్కూలు బస్సు వచ్చినట్లు శబ్దం అయితే బయటకు వెళ్ళాను. స్కూలు బస్సులో నుండి దిగి పరిగెత్తివచ్చింది ఎలిమెంట్రీ స్కూలు కెళ్ళే నా కూతురు పవిత్ర. పవిత్రను ఇంట్లోకి తీసుకుని పోయి, సుమకు పరిచయం చేశాను.

"అరే! పద్మూ! నీకు ఇంత కూతురు కూడా ఉందా?"

"చూస్తుంటే కనిపించటంలేదా మిస్ కాజోల్?"

"మరి మీ ఆయనను చూపించలేదా?"

నేను సమాధానం చెప్పక, మౌనంగా ఉండిపోయాను.

"సారీరా! నిన్ను అనవసరంగా బాధపెట్టివుంటే" అని క్షమాపణ చెప్పింది నా మౌనాన్ని చూసి.

"అదేమిలేదులే!" అని, పాపను ఒడిలో కూర్చోబెట్టుకుని గతం అనే మూసివేయబడిన తలుపులు తెరిచాను.

*******

నా ఫ్రెండ్సందరూ డిగ్రీ పూర్తికాగానే ఇంకా పై చదువులు చదవడానికి వెళుతున్నారు. నేను కూడా పై చదువులు చదవాలనుకున్నాను కాని నాన్న పెళ్ళి చేయాలని నిర్ణయం తీసుకున్నాడు. నాన్నకు ఎదురు చెప్పలేకపోయాను. నాన్న ఉన్న ఆస్థినంతా ధారబోసి పెళ్ళిచేశాడు.

నా భర్త కంప్యూటరు సైన్సు చదివి, మంచి జాబ్ చేస్తుండేవాడు. ఆయన హైదరాబాదులో జాబ్ చేస్తుండడం వలన పెళ్ళి జరిగిన తర్వాత హైదరాబాదులోనే ఉండేవాళ్ళం. నన్ను చాలా ప్రేమగా చూసుకునేవాడాయన.

నేను డిగ్రీ చదివాను కాబట్టి ఏదైనా ఉద్యోగం చూసుకుంటే బాగుంటుందని అప్పుడప్పుడు అంటుండేవాడు. కాని నాకు ఉద్యోగం కోసం మళ్ళీ చదవడానికి అంతగా ఇష్టంలేకపోయింది. కాని ఆయన ప్రోత్సాహంతో చదవడం మొదలుపెట్టాను.

ప్రస్తుతకాలంలో దంపతులిద్దరూ ఉద్యోగం చేస్తేగాని బతకలేరని అంటుండేవాడు. నేను ఉద్యోగం కోసం ప్రిపేరవడం కోసం పిల్లలు కూడా వద్దన్నాడు ఆ సమయంలో.

ఆయన ప్రోత్సాహంలేకపోతే నాకు జాబ్ వచ్చేదికాదు. నేను సంవత్సరం కష్టపడి ప్రిపేరయినందుకు ప్రతిఫలంగా నాకు స్టేట్ బ్యాంకులో జాబ్ వచ్చింది. నేను మా నేటివ్ ప్లేస్ నంద్యాలలో ఉద్యోగినిగా జాయినయ్యాను.

ఆయన వారానికొకసారి వచ్చేవాడు. కొన్నిసార్లు సెలవు దొరకక రాలేకపోయేవాడు వారానికొకసారి కూడా. మా మధ్య దూరం పెరగడం మొదలయింది. అంతలో పవిత్ర పుట్టింది. పాపను చూసుకోటానికి చాలా కష్టాలు పడ్డాను.

ఆయాల చేతుల్లో పాపను పెట్టి, బ్యాంకుకు పోవాలంటే చాలా బాధవేసేది. నాకు దేవుడు మాతృత్వం ప్రసాదించి తప్పుచేసాడని, ప్రతిరోజు దేవుణ్ణి తిట్టుకునేదాన్ని ఆ బాధతో...

నేనేమి తప్పుచేయకపోయినా నింద పడాల్సి వచ్చింది ఓ రోజు. అనవసరంగా నాకు, మా మేనేజరుకు ముడిపెట్టారు. దాంతో మా ఆయన నన్ను ఇంతకు ముందులాగా ప్రేమగా చూడడం మానేశాడు.

"నీ పెళ్ళాం మేనేజరుతో ఏం మాట్లాడుతుందిరా! నా పెళ్ళాం గాని ఆ విధంగా మాట్లాడితే నరికి పోగులు పెట్టేటోన్ని." అని అన్నాడంట మా ఆయనతో నాకు తెలిసినొకాయన.

అనవసరంగా నా మీద నిందలు మోపారు. మా ఆయనకు నామీద నమ్మకం ఉన్నప్పటికీ, వారి మాటల ప్రభావం నాతో విడాకులు తీసుకునేందుకు పునాది వేసింది. చాలా గొడవలయ్యాయి. ఆ గొడవలలో ఆయన కూడా నన్ను చాలా నీచమైన మాటలన్నాడు.

ఆయనలాంటి ఉత్తముడి నోటినుండి కూడ నీచమైన మాటలు రప్పించింది లోకులు వేసిన నింద. మూడు ముళ్ళు వేసి నాలుగేళ్ళయినా కాకముందే విడాకులు తీసుకోవడం జరిగిపోయింది. కాసింత దూరంవలన ఎన్నో అనర్థాలు జరిగాయి. ఇక మా మధ్య శాశ్వత దూరం చోటుచేసుకుంది. ఇంకెన్ని అనర్థాలు జరుగుతాయో?

****

"అంటే, విడాకులు తీసుకుని మూడేళ్ళవుతుందా?" అని అడిగింది సుమ.

అవునని తలూపాను.

"మరల పెళ్ళిచేసుకోకూడదా?"

"మళ్ళీ పెళ్ళిచేసుకోవడం నాకిష్టంలేదు. నాకు నా బిడ్డ పవిత్రే ప్రపంచం. నా కథ పక్కకు పెడితే నువ్వు ఇంకా పెళ్ళిచేసుకోలేదు?"

"నాన్నకు నాకు పెళ్ళిచేసేంత స్థోమత ఉండలేదప్పటికి. ఇపుడు తను రిటైరు అయి వచ్చిన డబ్బుతోనే నా పెళ్ళి. పద్దు! మరి ఇపుడు నీవు అమ్మా నాన్నను తోడుగా ఉంచుకోవచ్చుగా? ఒంటరిగా ఉండడం ఎందుకు? "

"వాళ్ళు తమ్ముడి దగ్గరే ఉంటున్నారు. తమ్ముడికి ఇంకా పెళ్ళి కాలేదు. తమ్ముడి పెళ్ళి అయిపోతే వాళ్ళు నా దగ్గరే ఉంటారు."

"ఎన్నాళ్ళయింది ప్యాపిలికి ట్రాన్సఫర్ వచ్చి?"

"రెండు సంవత్సరాలయింది. ఇక్కడికి దగ్గరలో మా పెదనాన్నవాళ్ళు ఏనుగు మర్రిలో ఉంటున్నారు. పాపకు అనుకూలంగా ఉంటుందని వాళ్ళదగ్గరే ఓ సంవత్సరం ఉన్నాను. ప్రతిరోజూ బస్సులో ఆఫీసుకు వచ్చి వెళ్ళేదాన్ని. ఈ మధ్యనే టౌనులోనే అద్దె ఇంట్లో ఉంటున్నాను."

"నువ్వు చెప్పినదాన్నిబట్టీ చూస్తే నాకు చాలా భయమేస్తోందే! ఇలాంటి లోకుల ఊహాగానాలు ముందుగానే ఊహించి రాముడు సీతను కూడా తనతో అరణ్యానికి తీసుకునిపోయాడేమో! అయినప్పటికి రాముడు సీతను దూరం చేసుకున్నాడు. కాలం గుప్పిట్లో మనమందరం బందికాక తప్పదేమో!"

"దంపతులు దూరంగా బతకరాదు. వారు కలిసి జీవిస్తేనే ఆనందం` అని అంటాన్నేను. సరేకాని నా విషయం మరచిపోయి కాస్త నీ లైఫ్ గురించి చెపితే బాగుంటుందేమో!"

"నా విషయానికి వస్తే పెళ్ళినిశ్చయమైంది. ఆయన పనిచేసేది విజయవాడలో లెక్చరరుగా. పెళ్ళి జరిగిన తర్వాత నేనిక్కడ, ఆయనక్కడ అని తలుచుకుంటేనే భయమేస్తుందే! నేను ఈ గవర్నమెంటు ఉద్యోగాన్ని ఎలా వదులుకోగలను? మాకు చిన్నప్పటినుంచి తెలిసిన ఆ మంచి సంబంధాన్ని వదులుకోలేను! ఇప్పుడు నా పరిస్థితి ఏంటో నాకే అర్థం కాకుండా ఉందే!" అని తలపట్టుకుని కూర్చుంది సుమ.

●●●

Click here to share your comments on this story